నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 17 మే 2024 YADADRI BHUVANAGIRI

# ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

భువనగిరి కలెక్టరేట్, మే 16 : నమస్తే తెలంగాణ పత్రికలో ప్రచురితమైన కథనాలకు స్పందించిన జిల్లా యంత్రాంగం తడిసిన ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా రైతులు ధర్నాలు, నిరసనలు చేపట్టగా.. నమస్తే తెలంగాణ ప్రధాన సంచికలో ఈ నెల 15న వడ్లు కొనండి బాంచెన్, 16న 'గుండె మండిన రైతు' వంటి కథనాలను ప్రచురించింది. దీనికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. భువనగిరి మండలంలోని పచ్చల తండా, ఆకుతోటబావి తండా, సూరేపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. దాంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# శాసన మండలికి విద్యావంతులను పంపించాలి

- బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి
- వాకర్స్, క్రీడాకారులు, ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థన



భువనగిరి పట్టణంలో వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మే 16 : శాసన మండలికి మేధావులు, విద్యావంతులు, ఆదర్శవంతులను అందించాలని, మాయ మాటలు చెప్పి కాలం గడిపే వారిని పంపించవద్దని బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని పెద్ద చెరువు కట్ట వద్ద గురువారం ఉదయం మార్నింగ్ వాకర్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడాకారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కళాశాలలో ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్యానికి ప్రతీక భువనగిరి జిల్లా అని, త్యాగానికి, తిరుగుబాటుకు ముందుంటుందని అన్నారు. పట్టభద్రుల ఎన్నిక సాధారణ ఎన్నికల కంటే ప్రత్యేకంగా, భిన్నంగా ఉంటుందని.. ఈ ఎన్నికకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని పేర్కొన్నారు. శాసన మండలికి మంచి వ్యక్తులను ఎంచుకొని పంపాలని, స్వార్థం, పరిస్థితులను బట్టి మాటలు చెప్పే వారిని పంపవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీని, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కే సాధ్యపడుతుందన్నారు. ప్రశ్నించే గొంతు కావాలి తప్ప.. ప్రశంసించే గొంతు కావద్దని పేర్కొన్నారు. విద్యావంతుల సమస్యలు పరిష్కారం కావాలంటే విద్యావంతుడు, మేధావి అయి ఉండాలన్నారు. విద్యావంతులు ఆలోచించి విద్యావంతుడు, మేధావికి పట్టం కట్టాలని కోరారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో వరుసగా బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని, ఈ ఎన్నికల్లో కూడా గెలుపు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ గతంలో విద్యావంతుల సమస్యలను పట్టించుకునే వారు లేరని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యపడిందని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే మేధావులు, విద్యావంతులు ఉండాలని, అలాంటి వ్యక్తులకే మాజీ సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పథకాలను కూడా నిలిపివేశారని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన సంక్షేమ పథకాలతో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, వాటిని నిలిపివేసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కంట్లో నలుసైందని అన్నారు. పది సంవత్సరాల నుంచి సాఫీగా సాగుతున్న సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్, కేసీఆర్‌పై ఉన్న కోపంతో అడ్డుకట్ట వేసి ప్రజలను గోస పెడుతుందని విమర్శించారు. మేధావులు, విద్యావంతులు ఆలోచించి శాసన మండలికి సరైన వ్యక్తులను పంపాలని కోరారు. అవకాశం కోసం ఎదురుచూసే వారిని, పూటకో మాట మార్చే వ్యక్తులకు అవకాశం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు ఎన్నబోయిన ఆంజనేయులు, ఏవీ కిరణ్‌కుమార్, సూర్యనారాయణరెడ్డి, జలేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



భువనగిరిలో బార్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని వస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# యాదగిరీశుడిని దర్శించుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

యాదగిరిగుట్ట, మే 16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని గురువారం రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామివారి సన్నిధికి చేరుకున్న ఆయన సుదర్శన నారసింహ హోమంలో పాల్గొన్నారు.

స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కొండపై నుంచి హరీశ్‌రావు నృసింహస్వామి జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

# ధాన్యం దిగుమతులు త్వరగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, మే 16 : ధాన్యం బస్తాలను త్వరగా దిగుమతి చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రైస్ మిల్లుల ప్రతినిధులతో గురువారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులకు ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేయాలని, రైతుల నుంచి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం లారీలను త్వరగా దిగుమతి చేయించాలని, ఆ వెంటనే ఆన్‌లైన్ నమోదు చేయాలని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ.524 కోట్ల విలువైన 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డి, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# పట్టుదలతో పనిచేస్తే.. పట్టభద్రులు మన వెంటే

- కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసింది
- హామీల అమలులో పూర్తిగా విఫలమైంది
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం తథ్యం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి , పక్కన మాజీ ఎంపీ బడుగుల

సూర్యాపేట టౌన్, మే 16 : 'రైతులు, మహిళలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులతోపాటు యువతను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. అటువంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే కృత నిశ్చయంతో యువత, ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులంతా ఏకమై పట్టుదలతో పనిచేస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తమకే దక్కుతుంది.' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం సూర్యాపేటలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సూర్యాపేట, హుజూర్‌నగర్ నియోజకవర్గాల ముఖ్య నేతలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన అంశాలపై పార్టీ శ్రేణులకు జగదీశ్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని, వారి వైఫల్యాలే ప్రధాన అస్త్రాలుగా చేసుకుని ప్రచారంలో దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని నిరుద్యోగులు, యువత ఎండగడుతున్నారని, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి విజయానికి జిల్లాలో సానుకూల వాతావరణం ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిద్ధంగా ఉన్న పట్టభద్రుల ఓటర్లందరినీ కలువాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల తరహాలో వారం రోజులు ప్రజాక్షేత్రంలో ఉండి కష్టపడి పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశాల్లో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఉన్నత విద్యా మండలి మాజీ సభ్యుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం చేయకపోతే ఎస్పీ కార్యాలయం ముట్టడిస్తాం

- నకిరేకల్ నియోజకవర్గంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండలో ఎస్పీని కలిసి వస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నీలగిరి, మే 16: నకిరేకల్ నియోజకవర్గంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని, వారి తీరులో మార్పు రాకపోతే న్యాయ పోరాటం చేస్తామని, అవసరమైతే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. ఐదు నెలలుగా నియోజకవర్గంలో జరిగిన పలు ఘటనలపై గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీని కలిసి వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో పోలీస్ యంత్రాంగం అంతా కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తూ న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన వారిపైనే కేసులు నమోదు చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు స్టేషన్‌కు వచ్చి రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని అడిగే పరిస్థితి లేదన్నారు. నార్కట్‌పల్లి ఎస్ఐ కేవలం కాంగ్రెస్ నాయకులను మాత్రమే స్టేషన్‌లోకి అనుమతిస్తున్నారని, మిగతా వారిని బయటే ఉంచుతున్నారని తెలిపారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులు సైదిరెడ్డి, వెంకన్న బైక్‌పై వెళ్తుంటే అకారణంగా బైక్‌ను ఆపి సెల్‌ఫోన్, తాళం చేతులు లాక్కొని వారిని కొట్టారని పేర్కొన్నారు. నాగరాజు అనే వ్యక్తి గంజాయి మత్తులో మాజీ సర్పంచ్‌ను బీరు సీసాతో చంపుతానని బెదిరించాడని, కేతేపల్లి మండలం చెర్కుపల్లికి చెందిన దళిత యువకుడు సైదులును కొందరు చెట్టుకు కట్టేసి కొడితే అతను స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, పోలీసులు న్యాయం చేయక పోగా అతడిపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. వల్లాపురం గ్రామంలో ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకులను రెండు రోజులు స్టేషన్‌కు తీసుకొచ్చి కొడుతున్నారని, అడిగితే వారిపైనే కేసులు పెడుతున్నారని తెలిపారు. ఈ విషయాలన్నీ గతంలో రెండు సార్లు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేదన్నారు. రెండు రోజుల్లో న్యాయం జరుగకపోతే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షం నీరు

# చౌటుప్పల్‌లో భారీ వర్షం

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

చౌటుప్పల్, మే 16 : చౌటుప్పల్ మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేయగా.. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనంతరం సుమారు గంట పాటు మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. వడ్ల కుప్పల చుట్టూ వరద నీరు నిలిచింది. భువనగిరి, ఆత్మకూర్ (ఎం)తో పాటు పలు మండలాల్లోనూ వర్షం కురిసింది.

## నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో వర్షం

నల్లగొండ/ కొండమల్లేపల్లి : నల్లగొండ జిల్లాలో గురువారం పలు మండలాల్లో వర్షం కురిసింది. కొండమల్లేపల్లి మండలంలో గంటపాటు కుండపోత వర్షం కురిసింది. వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లాలో అత్యధికంగా కనగల్ మండలంలో 68.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాంపల్లి మండలంలో 62, చింతపల్లిలో 49, గుర్రంపోడు, నల్లగొండలో 44, తిప్పర్తిలో 36, కేతేపల్లిలో 35, కొండమల్లేపల్లిలో 31.03, దేవరకొండ మండలంలో 30.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగతా మండలాల్లో పాక్షికంగా కురిసింది.



నల్లగొండలో కురుస్తున్న వర్షం

# కాంగ్రెస్‌వన్నీ బోగస్ మాటలు

- అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాల్సిందే..
- ఎన్నికల ముందు హామీ ఇచ్చి రైతులను మోసం చేస్తారా?
- ఇప్పటికే రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన
- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, విజయసింహారెడ్డి
- హాలియా, దేవరకొండ, మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా
- జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు



ధాన్యం బోనస్‌పై మాటమార్చిన కాంగ్రెస్ తీరుకు నిరసనగా దేవరకొండలో ధర్నా చేపడుతున్న బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

చందంపేట(దేవరకొండ), మే 16 : ఎన్నికల ముందు అన్ని రకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి రైతులను మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సన్న రకం వరి ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పడంపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దేవరకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికే రైతుబంధు ఇవ్వకపోగా రైతు భరోసా పేరిట కాలయాపన చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు రకం వడ్లను పండిస్తారని ఈ విషయం తెలిసి కూడా, సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పడం తప్పించుకోవడమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిండి ఎంపీపీ మాధవరం సునీతాజనార్దన్‌రావు, దేవరకొండ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు వల్లపురెడ్డి, దస్రూనాయక్, లోకసాని తిరుపతయ్య, గాజుల ఆంజనేయులు, గిరిధర్, లింగారెడ్డి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, బాలయ్య, శంకర్‌నాయక్, నీలా రవికుమార్, వేముల రాజు, కృష్ణ, రమేశ్, లోక్యానాయక్, తులసీరాం, పొట్ట మధు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని రాష్ట్ర అగ్రోస్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట బోనస్‌పై మాటమార్చిన కాంగ్రెస్ వైఖరి పట్ల మిర్యాలగూడ పట్టణంలో గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో తిప్పన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పూటకోమాట మారుస్తూ రైతాంగాన్ని మోసం చేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతురుణమాఫీ ఫైల్‌పై సంతకం చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఆగస్టు 15 వరకు చేస్తామని దేవుళ్లపై ఒట్లు చేసే స్థాయికి దిగజారారని తెలిపారు. ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని మండిపడ్డారు. హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, దామరచర్ల జడ్పీటీసీ ఆంగోతు లలితాహాతీరాం, పట్టణ మహిళావిభాగం అధ్యక్షురాలు పెండ్యాల పద్మ, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిట్టి బాబునాయక్, కోఆప్షన్ సభ్యులు మోసిన్ అలీ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, పాక్స్ మాజీ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కరీం, పునాటి లక్ష్మీనారాయణ, తలకోన శ్రీధర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాస్, చాంద్‌పాషా, మన్నెం శ్రీధర్‌రెడ్డి, పశ్య శ్రీనివాస్‌రెడ్డి, అంజన్‌రాజు, గుడిసె దుర్గాప్రసాద్, ఘంట శ్రవణ్‌రెడ్డి, అంజయ్య, కోదాటి రమా తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి ఆందోళన చేపడుతున్న రాష్ట్ర అగ్రోస్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## సంస్థాన్ నారాయణపురంలో..

సంస్థాన్ నారాయణపురం : సన్న వడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గురువారం ధర్నా చేపట్టారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నర్రి నరసింహ, గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ భిక్షం, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డుపల్లి గాలయ్య, నాయకులు వీరమళ్ల జంగయ్య, సిద్దగోని శ్రీను, బోడ రాజు, లక్ష్మారెడ్డి, సుర్వి యాదయ్య, పాండురంగా నాయక్, శ్రీరాముల నరసింహ, వడ్డేపల్లి రాములు, జక్కిడి యాదిరెడ్డి, నలపరాజు రమేశ్, ఉప్పల శ్రీను, రాసాల వెంకటేశ్, బొమ్మగోని రమేశ్ పాల్గొన్నారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న రకానికి మాత్రమే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడంపై గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా రైతు భరోసా ఇవ్వలేదని, ఇప్పుడు ధాన్యంపై బోనస్ ఇవ్వకుండా మాట మార్చిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని, హామీలన్నీ నెరవేరే దాకా ఊరుకునేది లేదని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, తిరుమలగిరి సాగర్, నిడమనూరు బీఆర్‌ఎస్ మండలాల అధ్యక్షులు పిడిగం నాగయ్య, తాటి సత్యపాల్, ఎంపీటీసీ వెంకటయ్య, బొమ్మిశెట్టి ఆంజనేయులు, సురబి రాంబాబు, వర్రా వెంకట్‌రెడ్డి, నాయకులు మెండె సైదులు, కేశబోయిన శంకర్, బొల్లేపల్లి రమణరాజు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు